యువతి వెంటపడ్డాడని యువకుడి హత్య?

- ఎంత చెప్పినా వినకపోవడంతో చితకబాదిన అమ్మాయి తండ్రి
- తీవ్రగాయాలతో దవాఖానలో చికిత్స పొందుతూ మృతి

మహేశ్‌గౌడ్ మృతదేహం

సదాశివపేట, జనవరి 4: ప్రేమపేరుతో యువతి వెంటపడుతున్న ఓ యువకుడిపై ఆమె కుటుంబ సభ్యులు దాడి చేయగా.. తీవ్ర గాయాలతో దవాఖానలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం మద్దికుంటకు చెందిన మహేశ్‌గౌడ్ గ్రామంలోని ఓ అమ్మాయిని ప్రేమించాడు. గత నెల 31న ఆ యువతి ఇంటి ముందు ముగ్గులు వేస్తుండగా తన సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీశాడు. దీన్ని గమనించిన యువతి తమ్ముడు.. మహేశ్‌గౌడ్ సెల్‌ఫోన్‌ను పగులగొట్టాడు. ఇదే విషయాన్ని యువతి తండ్రి రాములుకు చెప్పడంతో.. ఆయన తమ అమ్మాయి వెంటపడొద్దని హెచ్చరించాడు. అయినా వినకుండా మరుసటి రోజు కూడా యువతి వెంటపడుతుంటే మహేశ్‌గౌడ్‌ను రాములు కొట్టాడు. గాయాలపాలైన మహేశ్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మహేశ్‌గౌడ్ మద్యం తాగేవాడని, ఆరోగ్య సమస్యలు కూడా ఉన్నట్టు సమాచారం. అనారోగ్య కారణాల వల్ల మరణించాడా? లేక యువతి కుటుంబ సభ్యులు దాడి చేయడం వల్ల మృతి చెందాడా? అనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రేమను నిరాకరించిందని కత్తితో దాడి

- కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో ఉన్మాది ఘాతుకం
- చికిత్స పొందుతున్న యువతి

చికిత్స పొందుతున్న కావ్యశ్రీ

రాంనగర్, జనవరి 4: ప్రేమను నిరాకరించిందని ఓ యువతిపై ఉన్మాది కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన ఆడెపు వీరేశం – రేణుక దంపతుల కూతురు కావ్యశ్రీ ఎమ్మెస్సీ చదువుతున్నది. ఆమె ఇంటి సమీపంలో ఉండే బొద్దుల సాయి కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. గతంలో ఓసారి పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. తర్వాత ఆ యువకుడు కొత్తపల్లి నుంచి మంథని వెళ్లిపోయాడు. మూడు రోజుల క్రితమే కొత్తపల్లికి వచ్చాడు. ఈ క్రమంలో కావ్య ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని గమనించి సాయి ఇంట్లోకి చొరబడ్డాడు. తనను ప్రేమించాలని బలవంతం చేశాడు. ఆమె ఒప్పుకోకవడంతో అక్కడే ఉన్న కత్తితో కావ్యశ్రీ గొంతు కోసేందుకు ప్రయత్నించాడు. ఆమె చేతులు అడ్డం పెట్టడంతో మెడకు చేతులకు గాయాలయ్యాయి. కావ్య గట్టిగా కేకలు వేయడంతో సాయి అక్కడి నుంచి పరారయ్యాడు. కుటుంబ సభ్యులు కావ్యశ్రీని కరీంనగర్‌లోని దవాఖానకు తరలించారు. రూరల్ ఏసీపీ కర్ణాకర్ రావు, సీఐ ప్రదీప్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దవాఖానకు వెళ్లి ఆమె వాంగ్మూలం తీసుకొని, నిందితుడు సాయిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏసీపీ తెలిపారు.

పెండ్లి బృందంపై కారెక్కించిన కిరాతకుడు

- యువతి మృతి.. ఐదుగురికి గాయాలు
- పాత కక్షలతోనే ఘాతుకం

రమ్య (ఫైల్)

చేగుంట, జనవరి 4: పాతకక్షలను దృష్టిలోపెట్టుకొని ఓ వ్యక్తి కారుతో పెండ్లిబృందాన్ని ఢీకొట్టడంతో ఓ యువతి మృతి చెందగా.. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం రెడ్డిపల్లి కాలనీలో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిపల్లి వడ్డెర కాలనీకి చెందిన వడ్డె వెంకటి కుతూరు స్వాతి వివాహం గురువారం జరిగింది. సాయంత్రం పెండ్లికూతురిని అత్తగారి ఇంటికి సాగనంపే సమయంలో ఉప్పు స్వామితోపాటు పలువురు కులస్థులు ఉన్నారు. ఉప్పు స్వామికి వడ్డె నరేందర్‌కు పాత కక్షలు ఉన్నాయి. ఈ క్రమంలో స్వామి కుటుంబ సభ్యులు పెండ్లి బృందంలో ఉన్నారు. దీంతో వడ్డె నరేందర్ కారు నడుపుతూ పెండ్లి బృందంపైకి తోలడంతో ఉప్పు రమ్య (20), ఉప్పు దుర్గయ్య, సంపంగి యాదగిరి, ఉప్పు సుజాత, బబ్బుకు గాయాలయ్యాయి. అదే సమయంలో భీంరావ్‌పల్లికి చెందిన కాపు యాదగిరి బైక్‌పైకి దూసుకెళ్లడంతో అతడికి కూడా గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన దుర్గయ్యను కామారెడ్డి దవాఖానకు తరలించారు. హైదరాబాద్‌కు తరలిస్తున్న రమ్య మార్గమధ్యంలో మృతి చెందింది. మరి కొందరిని నార్సింగి దవాఖానకు తరలించారు. చేగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యతో వస్తేనే దరఖాస్తు ఇస్తాం

- 'ప్రజాపాలన' గ్రామ సభలో యువకుడికి వింత అనుభవం

అబ్బుగారి పోచయ్య

నర్సాపూర్, జనవరి 4: ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తు చేసుకోవడానికి వెళ్లిన ఓ వ్యక్తికి వింత అనుభవం ఎదురైంది. భార్యతో కలిసి వస్తేనే దరఖాస్తు ఫారం ఇస్తామని అధికారులు చెప్పడంతో సదరు వ్యక్తి కంగుతిన్నాడు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన అబ్బుగారి పోచయ్యకు రెండేండ్ల క్రితం వివాహమైంది. కుటుంబ కలహాలతో ఇటీవల ఆమె పుట్టింటికి వెళ్లింది. పలుమార్లు భార్య వద్దకు వెళ్లి కాపురానికి రావాలని కోరగా ఆమె నిరాకరించింది. ప్రభుత్వం అందించే ఆరు గ్యారెంటీల పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు గురువారం ఆయన గ్రామపంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లాడు. దరఖాస్తు ఇవ్వాలని పోచయ్య అధికారులను కోరగా.. 'నీ భార్య వస్తేనే ఇస్తాం' అని అధికారులు తేల్చి చెప్పడంతో అయోమయంలో పడ్డాడు. ఆ వెంటనే ఆయన భార్యను తీసుకురావడానికి అత్తగారింటికి వెళ్లగా వాళ్లు పంపలేదు. అటు భార్య కాపురానికి రాక.. ఇటు ఆరు గ్యారెంటీల దరఖాస్తు పొందలేక పోచయ్య అయోమయంలో పడ్డాడు. భార్యలకే దరఖాస్తు ఇవ్వాలనుకున్న వారు దరఖాస్తు ఫారంలో పురుషుడు అనే కాలం ఎందుకు పెట్టారని పోచయ్య అధికారులను ప్రశ్నించాడు.

గుర్తింపుకార్డు చూపిస్తే ఇస్తాం..

దరఖాస్తు ఫారం ఇవ్వడానికి ఏదైనా గుర్తింపు కార్డు తేవాలని కోరినట్టు పంచాయతీ కార్యదర్శి శ్వేత చెప్పారు. అతని వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో దరఖాస్తు ఇవ్వలేదని తెలిపారు. అంతకుముందు అతని తల్లి దరఖాస్తు తీసుకున్నదని, అదే కుటుంబంలో ఇంకో ఫారం ఇవ్వాలంటే అతని గుర్తింపు కార్డు ఏదైనా చూపాలని కోరినట్టు పేర్కొన్నారు.

విద్యుత్తు వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచండి

- అందుకు ప్రణాళికలు సిద్ధం చేయండి
- 2031-32 అవసరాలు దృష్టిలో పెట్టుకోండి
- విద్యుత్తుపై సమీక్షలో మంత్రి భట్టి ఆదేశం

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): ప్రజల అవసరాలకు తగినట్టుగా విద్యుదుత్పత్తి చేయడంతోపాటు సరఫరా, పంపిణీ వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచేందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను విద్యుత్తుశాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రిజ్వీ, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, ఇతర అధికారుతో విద్యుత్తుపై మంత్రి సమీక్షించారు. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ అంచనాల ప్రకారం 2031–32 నాటికి పెరగనున్న రాష్ట్ర విద్యుత్తు అవసరాలను పరిగణలోకి తీసుకుని ఆయా వ్యవస్థల సామర్థ్యం పెంచడానికి చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఎన్టీపీసీ ఫేజ్–2లో 2400 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని, జైపూర్ థర్మల్ పవర్‌స్టేషన్‌లో అదనంగా 800 మెగావాట్ల (మూడో యూనిట్) ప్లాంట్ నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర విభజన హామీ మేరకు ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4 వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా తొలి విడతలో 1600 మెగావాట్ల ప్లాంట్‌ను నిర్మిస్తున్నట్టు అధికారులు డిప్యూటీ సీఎంకు తెలిపారు. మంత్రి భట్టి గురువారం ఎస్‌పీడీసీఎల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆ సంస్థ సీఎండీ ఫారూఖీ, డైరెక్టర్లు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. విద్యుత్తు అకౌంట్స్ ఆఫీసర్ల అసోసియేషన్ (వీఏవోఏటీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ అంజయ్య ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం గురువారం సచివాలయంలో మంత్రిని భట్టిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శాలువాకప్పి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వీఏవోఏటీ వైస్ ప్రెసిడెంట్ నాజర్ షరీఫ్, జాయింట్ సెక్రటరీలు వీ పరమేశ్, జే స్వామి, ఎస్‌పీడీసీఎల్ కంపెనీ సెక్రటరీ కే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై బుక్‌లెట్‌ను ఖండిస్తున్నాం

- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ హామీలపై బీఆర్ఎస్ పార్టీ బుక్‌లెట్ వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. గురువారం గాంధీభవన్‌లో మంత్రి సీతక్కతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 25 రోజులు కూడా కాలేదని, హామీల అమలుపై తగిన సూచనలు సలహాలు ఉంటే ఇవ్వాలని చెప్పారు. 420 ఎవరో? డబుల్ 420 ఎవరో? ప్రజలకు తెలుసన్నారు.

గడువులోగా పనులు చేయాలి

- మారుమూల ప్రాంతాలకు రోడ్లను అనుసంధానం చేయాలి
- పీఆర్ ఇంజినీరింగ్ విభాగంపై మంత్రి సీతక్క సమీక్ష

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): గ్రామీణ ప్రాంతాలు, తండాలకు మండల కేంద్రాల నుంచి రోడ్ల అనుసంధానం ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. పీఎంజీఎస్‌వై, ఉపాధిహామీ వంటి వివిధ పథకాల కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను పొంది సమర్థంగా వినియోగించాలని సూచించారు. గురువారం సెక్రటేరియట్‌లో పీఆర్ ఇంజినీరింగ్ శాఖపై మంత్రి సమీక్షించారు. పంచాయతీరాజ్ పనులకు నాబార్డు నుంచి నిధులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని, పనుల నాణ్యతలో రాజీ పడొద్దని సూచించారు. నాసిరకమైన పనులు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శాఖాపరమైన సమస్యలు, పెండింగ్ బిల్లుల విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని, వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమీక్షలో ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఇంజినీర్ ఇన్ చీఫ్ సంజీవరావు, సీఈలు సీతారాములు, కనకరత్నం, శివకుమార్, అశోక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

250 యూనిట్ల ఉచిత విద్యుత్తు యథాతథం

- సెలూన్లు, లాండ్రీల కనెక్షన్లు ఎవరూ కట్ చేయరు
- రజకులు, నాయీ బ్రాహ్మణులకు మంత్రి పొన్నం భరోసా

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని రజకులకు, నాయీబ్రాహ్మణులకు అందిస్తున్న 250 యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకం యథాతథంగా అమలుకానున్నది. ఈ మేరకు బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆ విద్యుత్తు కనెక్షన్లను కూడా కట్ చేయవద్దని గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం 2021–22 ఆర్థిక సంవత్సరం నుంచి లాండ్రీలు, ధోబీఘాట్లు, సెలూన్లకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పథకాన్ని అమలు చేస్తున్నది. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా 76,060 మంది రజకులు, 36,526 మంది నాయీబ్రాహ్మణులు లబ్ధి పొందుతున్నారు. ఆ నిధులను వాషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా ప్రభుత్వం ఆయా డిస్కంలకు నేరుగా చెల్లిస్తూ వస్తున్నది. మూడు నెలలుగా ఆ బిల్లుల చెల్లింపు నిలిచిపోయింది. దాంతో లాండ్రీలు, ధోబీఘాట్లకు రూ.78.55 కోట్లు, సెలూన్లకు రూ.12.34 కోట్లు డిస్కంలకు బకాయి పేరుకుపోయింది. ఆ బకాయిలను విడుదల చేయాలని ఇప్పటికే ఆర్థికశాఖకు విజ్ఞప్తి చేశామని పొన్నం తెలిపారు. రజకులు, నాయీబ్రాహ్మణులు అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.

ఐదింటిలో ఒక లోక్‌సభ సీటివ్వండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఐదు లోక్‌సభ స్థానాల్లో తమ పార్టీ బలంగా ఉన్నదని, వాటిల్లో ఏదైనా ఒక స్థానం తమకు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీని తాము కోరామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. హైదరాబాద్ సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తోనే కలిసి వెళ్లాలని నిర్ణయించుకున్నామని, వరంగల్, నల్లగొండ, భువనగిరి, పెద్దపల్లి, ఖమ్మం స్థానాలపై ఫోకస్ పెట్టామని, వీటిలో ఏదో ఒక స్థానం కేటాయించాలని తాము సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పినట్టు వివరించారు. పార్లమెంటు ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఉండాలని కోరారు. ఆ పార్టీతో పొత్తు ఉన్నప్పటికీ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. హామీల అమలు విషయంలో కొత్త ప్రభుత్వానికి కొంత గడువు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర నేతలు చాడ వెంకటరెడ్డి, అజీజ్ పాషా పాల్గొన్నారు.

పాలమూరుకు హోదా ఇవ్వలేం

- కానీ, ఇతరత్రా 60% నిధులు ఇస్తాం
- సీఎంకు స్పష్టం చేసిన కేంద్రం
- ఐపీఎస్‌లను కేటాయించండి
- విభజన సమస్యలు పరిష్కరించండి
- హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రతిపాదనలు ఆమోదించండి
- కేంద్రానికి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- అమిత్‌షా, గజేంద్రసింగ్ షెకావత్, హర్దీప్‌సింగ్ పురీతో భేటీ
- నేడు యూపీఎస్సీ ఆఫీస్ సందర్శన
- వెల్లడించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కేంద్ర మంత్రి అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ/హైదరాబాద్, జనవరి4 (నమస్తే తెలంగాణ): పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. అలాంటి ప్రతిపాదనేదీ తమ వద్ద లేదని తేల్చిచెప్పింది. అయితే ఈ ప్రాజెక్ట్‌కు మరో విధంగా ఆర్థికసాయం అందిజేస్తామని, ఇతర పథకాల కింద 60% నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చింది. గురువారం ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. సీఎం, ఉత్తమ్‌కుమార్ గురువారం ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి, జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను విడివిడిగా కలిసి వివిధ అంశాలపై వినతిపత్రాలు అందజేశారు.

పాలమూరుకు జాతీయ హోదా ఇవ్వండి

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలని కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ పథకం కింద 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, 1,226 గ్రామాలతోపాటు హైదరాబాద్ మహా నగరానికి తాగునీరు సరఫరా చేయాల్సి ఉన్నదని చెప్పారు. ఇప్పటికే పలు అనుమతులు మంజూరయ్యాయని, మిగిలిన వాటిని కూడా త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. జాతీయ హోదా కల్పించి, 60% నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలకు అదనపు నిధుల కేటాయించేందుకు కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. 2014 తర్వాత కేంద్రం ఏ ప్రాజెక్టుకూ జాతీయ హోదా కల్పించలేదని, ఈ విధానం ప్రస్తుతం అమలులో లేదని చెప్పారని వెల్లడించారు. అయితే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ప్రాధాన్యం దృష్ట్యా ఆ ప్రాజెక్టుకు తమ శాఖ పరిధిలోని మరో పథకం కింద 60% నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

మెట్రో రెండో దశకు సవరించిన ప్రతిపాదనలు ఆమోదించండి

హైదరాబాద్ మెట్రో రెండో దశ సవరించిన ప్రతిపాదనలను ఆమోదించాలని కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ మెట్రో రెండో దశను సవరించాల్సి ఉన్నదని తెలిపారు. సవరించిన ప్రతిపాదనల ప్రకారం ఈ ప్రాజెక్టును సంయుక్తంగా చేపట్టే విషయాన్ని పరిగణనలోనికి తీసుకోవాలని కోరారు. హైదరాబాద్‌లోని మూసీ రివర్‌ఫ్రంట్‌ను బహుళ విధాలా ఉపయోగపడేలా చేస్తామని, కేంద్రం తగిన మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పేదలకు ఇచ్చే ఇందిరమ్మ ఇండ్లకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద అనుమతి ఇవ్వాలని కోరారు. తెలంగాణకు ఇండ్లు మంజూరు చేయడంతో పాటు బ్యాలెన్స్ నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం వెంట సీఎస్ శాంతికుమారి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, పట్టణాభివృద్ధి, పురపాలక వ్యవహారాల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దానకిశోర్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ, ఈఎన్సీ మురళీధర్ ఉన్నారు.

నేడు యూపీఎస్సీ కార్యాలయం సందర్శన

మంత్రి ఉత్తమ్‌కుమార్‌తో కలిసి సీఎం రేవంత్‌శుక్రవారం ఢిల్లీలోని యూపీఎస్సీ కార్యాలయాన్ని సందర్శించనున్నారు. టీఎస్‌పీఎస్సీని యూపీఎస్సీ తరహాలో మార్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై యూపీఎస్సీ చైర్మన్‌తో చర్చించనున్నారు. ఆయనతోపాటు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి, ఐఏఎస్ అధికారులు పాల్గొంటారు. టీఎస్‌పీఎస్సీని సంస్కరించాలని సీఎం నిర్ణయించారని ఉత్తమ్ తెలిపారు.

అదనంగా ఐపీఎస్ అధికారులను కేటాయించండి

తెలంగాణకు అదనంగా ఐపీఎస్ అధికారులను కేటాయించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు సీఎం విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు 76 మందినే కేటాయించారని తెలిపారు. జిల్లాల విభజన, వివిధ శాఖల పర్యవేక్షణ కోసం అదనంగా 29 పోస్టులు కేటాయించాలని కోరారు. 2024లో కొత్తగా వచ్చే ఐపీఎస్ బ్యాచ్ నుంచి అధికారులను అదనంగా కేటాయిస్తామని అమిత్‌షా హామీ ఇచ్చారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రేవంత్‌రెడ్డి అమిత్‌షాను కలవడం ఇదే ప్రథమం. ఈ సందర్భంగా రాష్ట్రానికి చెందిన పలు అంశాలను అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని వివిధ అంశాలను పరిష్కరించాలని కోరారు. యాంటీ తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో బలోపేతానికి రూ.88 కోట్లు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో బలోపేతానికి రూ.90 కోట్లు అదనంగా కేటాయించాలని కోరారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్, హైకోర్టు భవనం, లోకాయుక్త, హెచ్చార్సీ వంటి భవనాలను వినియోగించుకున్నందున ఆ రాష్ట్రం నుంచి వడ్డీతో కలిపి మొత్తం రూ.408 కోట్లు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

పూర్వ వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించండి

- రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వీ లచ్చిరెడ్డి వినతి
- ఎంప్లాయీ ఐడీలు ఇవ్వడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): పూర్వ వీఆర్‌ఏలకు ఎంప్లాయీ ఐడీలు ఇచ్చి, వేతనాల సమస్యను పరిష్కరించినందుకు ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ కృతజ్ఞతలు తెలిపింది. గురువారం హైదరాబాద్‌లో ఆ జేఏసీ అధ్యక్షుడు లచ్చిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పూర్వ వీఆర్‌ఏల మిగతా సమస్యలను కూడా దశలవారీగా ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. 61 మంది రికార్డు అసిస్టెంట్లకు ఇంకా ఏ శాఖలోనూ పోస్టింగ్ ఇవ్వలేదని, క్రమబద్ధీకరణలో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వీఆర్‌ఏలను సొంత జిల్లాలకు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. 61 ఏండ్లు దాటిన వీఆర్‌ఏ వారసులకు, 2014 తర్వాత చనిపోయిన వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. రెవెన్యూ విధుల నిర్వహణకు గ్రామ స్థాయిలో పటిష్టమైన యంత్రాంగాన్ని మళ్లీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, తెలంగాణ తాసిల్దార్ల సంఘం అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్, పూల్‌సింగ్, వీఆర్‌ఏల నాయకుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేత విక్రమ్ అలక?

- పార్టీ పట్టించుకోవడం లేదని ఆవేదన
- పిలిపించి మాట్లాడిన కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): మాజీమంత్రి ముఖేశ్‌గౌడ్ తనయుడు, సిటీ బీజేపీ యువనేత విక్రమ్‌గౌడ్ రాష్ట్ర నాయకత్వంపై అలిగినట్టు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తనకు పార్టీలో సముచిత స్థానం దక్కలేదని అసంతృప్తిగా ఉన్నట్టు తెలిసింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన గోషామహల్ టికెట్ ఆశించి భంగపడ్డారు. పార్టీ నుంచి రాజాసింగ్ సస్పెండ్ అయిన తర్వాత నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలు చూసుకోవడంతో టికెట్ ఆయనకేనన్న ప్రచారం జరిగింది. చివరి క్షణంలో రాజాసింగ్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేసిన అధిష్ఠానం తిరిగి ఆయనకే టికెట్ ఇవ్వడంతో విక్రమ్‌గౌడ్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఆయన పార్టీ వీడడం ఖాయమన్న ప్రచారం కూడా జరిగింది. వెంటనే నష్టనివారణ చర్యలు ప్రారంభించిన బీజేపీ పెద్దలు ఎన్నికల తర్వాత సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆయన వెనక్కి తగ్గారు. కానీ, ఎన్నికల తర్వాత నాయకత్వం తనను పట్టించుకోవడం లేదం టూ సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారట. ఇక లాభం లేదని పార్టీ వీడేందుకు సిద్ధమైన విక్రమ్‌గౌడ్‌ను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి గురువారం పిలిపించుకొని మాట్లాడి బుజ్జగించినట్టు తెలిసింది. అయినప్పటికీ ఆయన అలకవీడలేదని సమాచారం. ఎన్నికల ముందు కూడా ఇలానే చెప్పి తర్వాత పట్టించుకోవడం మానేశారని చెప్తూ సన్నిహితుల వద్ద వాపోయారట. త్వరలోనే ఆయన భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉందని ఆయన అభిమానులు చెప్తున్నారు.

చిత్తశుద్ధి ఉంటే దరఖాస్తులెందుకు?

- అయోమయంగా 'అభయహస్తం'
- 14 నుంచి స్వచ్ఛత అభియాన్
- అయోధ్య ప్రాణప్రతిష్ఠ లైవ్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 4 (నమస్త